క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ల సీజ్

రాజాం సిటీ: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను వేర్వేరు చోట్ల పట్టుకుని, సీజ్ చేశామని ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్ గురువారం వెల్లడించారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ ఎం.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది సహాయంతో రాజాం పట్టణంలో ఓ ట్రాక్టర్, రేగిడి మండలంలోని సంకిలి గ్రామం వద్ద మరో ట్రాక్టర్‌ను పట్టుకున్నారన్నారు. ట్రాక్టర్లను ఆయా పోలీస్‌స్టేషన్లకు అప్పగించామన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రంలోని వసతులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: రానున్న ఎన్నికల నేపథ్యంలో స్థానిక పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి గురువారం పరిశీలించారు. పాతబొబ్బిలి, తారకరామాకాలనీ, మల్లంపేట, ఐటీఐ కాలనీ, తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లిన ఆమె అక్కడ మౌలిక వసతులు ఉన్నవీ లేనివీ పరిశీలించారు. పోలింగ్ రోజు నాటికి ప్రతీ పోలింగ్ కేంద్రంలో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంప్ వంటి కనీస సదుపాయాలు ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట టీపీవో వరప్రసాద్, ఏఈ సురేష్ తదితరులు ఉన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి



వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథరావు

సంతకవిటి: కొలతల ప్రకారం ఉపాధి హామీ పనులు చేయాలని ఏపీవో హరనాథరావు వేతనదారులకు సూచించారు. మండలంలోని తాలాడ గ్రామ ముకుంద చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన గురువారం పరిశీలించారు. రెండు పూటలా నిర్దేశిత కొలతల ఆధారంగా పనిచేస్తే రోజుకు రూ.272 వస్తాయని తెలిపారు. అనంతరం వేతనదారుల మస్తర్లు పరిశీలించి, పనికి వచ్చిన వారికి మాత్రమే మస్తరు వేయాలని, తప్పుడు మస్తర్లు వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఏప్రిల్ 6లోగా పాఠశాలలో చేరాలి

బాడంగి: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశాల కోసం పరీక్ష రాసి, ఉత్తీర్ణులైన వారంతా ఏప్రిల్ 6వ తేదీలోగా పాఠశాలలో చేరాలని ప్రిన్సిపాల్ టి.రామదాసు అన్నారు. ఇదే విషయమై ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన ప్రవేశ పరీక్ష తొలి మెరిట్ జాబితాను ప్రభుత్వం ప్రకటించిందని, తొలి విడత ఫలితాల్లో మొత్తం 51 మంది విద్యార్థులు అర్హత సాధించారన్నారు. మొత్తం 80 సీట్లు ఉన్నాయని, ఉత్తీర్ణులైన వారంతా సంబంధిత ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాఠశాలకు వచ్చి, జాయిన్ కావాలన్నారు.

ఘనంగా ఎర్రమ్మ పేరంటాల సంబరాలు

బాడంగి: మండలంలోని ముగడ గ్రామంలో ఎర్రమ్మ పేరంటాలు సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముగడ, ముగడకాలనీ, బాడంగి ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ సంబరాల్లో పాల్గొని, ఎర్రమ్మ పేరంటాలుకు ప్రత్యేక పూజలు చేశారు.

విద్యాసామర్థ్యాలు మెరుగుపరచాలి



పిల్లలతో పదాలు చదివిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

వంగర: విద్యార్థుల విద్యాసామర్థ్యాలు మెరుగుపరచాలని ఎంఈవో ఎం.వి.ప్రసాదరావు అన్నారు. గురువారం మండలంలోని మెట్టమగ్గూరు ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన 3, 4, 5 తరగతులకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా, చదివించడం ద్వారా పిల్లల అభ్యసన స్థాయిలు పరిశీలించారు. తర్ల్ ప్రోగ్రాం పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.జగన్మోహనరావు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా విజయకుమారి

బాడంగి: ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సి.హెచ్.విజయకుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ అధ్యాపకురాలిగా పనిచేసి, పదోన్నతిపై ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

మళ్లీ గెలిపించండి.. మరింత మంచి చేస్తాం



ఎన్నికల ప్రచారంలో రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్‌కు హారతి ఇచ్చి, స్వాగతం పలుకుతున్న మహిళలు



పార్టీ విజయమే లక్ష్యంగా నేతలకు దిశానిర్దేశం చేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

రాజాం: రానున్న ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపిస్తే మరింత మంచి చేస్తామని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని మొగిలివలస, అంతకాపల్లి గ్రామాల్లో గురువారం పర్యటించిన వారికి ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా ప్రజలకు కలిగిన మేలును వివరించారు. ఎంపీగా మరోసారి పోటీ చేస్తున్న తనను గెలిపించాలని ఎంపీ, ఎమ్మెల్యేగా తొలిసారిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ ఓటర్లను కోరారు. ఎన్నికల వేళ టీడీపీ కూటమి చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. వారికి మళ్లీ అధికారమిస్తే మన గొయ్యి మనం తవ్వుకున్నట్లేనన్నారు. ఇప్పుడున్న సంక్షేమ పథకాలు ఏవీ వారు కొనసాగించరన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగించిన సీఎం జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు ఇవ్వడం జరిగిందని, అలాగే గ్రామాల వారీగా అభివృద్ధి పనులు కూడా చేయడం జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతీ ఇంటికి మేలు జరిగిందన్నారు. ఈసారి కూడా గతంలో కన్నా ఎక్కువ మెజార్టీతో పార్టీని గెలిపిస్తే ఇప్పుడు చేసిన మంచికి రెట్టింపు మంచి చేస్తామన్నారు. 2014లో టీడీపీ లేనిపోని హామీలను ఇచ్చి, అధికారంలోకి వచ్చిందని, ఆ ఐదేళ్లు జన్మభూమి కమిటీలతో ప్రజాధనం దోచుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం ఎన్నికలు వస్తుండడంతో మళ్లీ కూటమి(టీడీపీ, జనసేన, బీజేపీ) నేతలు గ్రామాల్లోకి వచ్చి, ఏవేవో హామీలు ఇస్తున్నారని, వాటిని నమ్మితే మళ్లీ మోసపోవడం ఖాయమన్నారు. రానున్న ఎన్నికల్లోనూ అందరూ వైఎస్సార్ సీపీకి ఓటు వేసి, రాష్ట్రంలోని ఇప్పటి అభివృద్ధి, సంక్షేమం కొనసాగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, యూత్ అధ్యక్షుడు గెడ్డాపు అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు, ఎంపీటీసీ సభ్యులు బౌరోతు కాంతారావు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు, టౌన్ యూత్ అధ్యక్షుడు వంజరాపు విజయ్‌కుమార్, నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ పాల్గొన్నారు.

పార్టీ గెలుపు ఖాయం..

రాజాం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని అంతకాపల్లి గ్రామంలో సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు ఇంట్లో పార్టీ నేతలు, కార్యకర్తలతో గురువారం సమావేశమైన ఆయన ఎన్నికల వేళ పార్టీ విజయానికి అంతా సమష్టిగా పనిచేయాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి, ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించాలన్నారు. ఈ నెలన్నర రోజులు కష్టపడితే మనమే మళ్లీ అధికారంలోకి వస్తామన్నారు. ప్రతీ ఇంట్లో ప్రభుత్వ పథకాలు అందుకున్న వారు ఉన్నారని, వారంతా తప్పకుండా పార్టీకి అండగా నిలుస్తారని, ఓటు వేసి గెలిపిస్తారన్నారు. మోసపూరిత హామీలతో మళ్లీ ప్రజల ముందుకు వస్తున్న టీడీపీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ పార్టీ విజయం సాధిస్తుందని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, పార్టీ రాజాం మండల అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, యూత్ అధ్యక్షుడు గెడ్డాపు అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నంనాయుడు, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు బౌరోతు కాంతారావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు, నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి విశేష ఆదరణ

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: వైఎస్సార్ సీపీకి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో గురువారం మాట్లాడిన ఆయన ఇటీవల పార్టీ పెట్టిన సిద్ధం సభలతో పాటు ఇప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న బస్సుయాత్రకు భారీగా జనాలు వచ్చి, జగనన్నకు.. జై.. కొడుతున్నారన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ నాయకులు గ్రామాల్లో పర్యటిస్తుంటే జనం వారికి నీరాజనం పలుకుతున్నారన్నారు. ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచే మళ్లీ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకువస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా అందిస్తున్న సంక్షేమ పథకాలు, అన్ని ప్రాంతాలు బాగుండేలా చేస్తున్న అభివృద్ధి పనులు, పారదర్శక పాలన వంటివి పార్టీని మరోసారి అధికారంలో నిలబెట్టేందుకు దోహదపడతాయన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ పార్టీ ఘనవిజయం ఖాయమని, విజయనగరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాలోని 19 సీట్లూ వైఎస్సార్ సీపీ ఖాతాల్లోకే వస్తాయన్నారు. అధికారం దాహంతో పొత్తులు పెట్టుకుని ఒక్కటైన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలను ప్రజలు నమ్మడం లేదన్నారు. మరోవైపు ప్రభుత్వంపై ఎల్లోమీడియా పనిగట్టుకుని మరీ చేస్తున్న దుష్ప్రచారాన్ని జనం ఖాతరు చేయడం లేదన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసే సీఎం జగనన్ననే ప్రజలు మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నారన్నారు. ఆయన చేసిన మంచి పనులే ఆయనను మళ్లీ సీఎం కుర్చీలో కూర్చోబెడతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను మరోసారి ఆశీర్వదించండి



రాజాం సిటీ: గురవాంలో ఎన్నికల ప్రచారంలో డాక్టర్ తలే రాజేష్

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

రాజాం సిటీ: వైఎస్సార్ సీపీ అందిస్తున్న సంక్షేమ పాలనను రానున్న ఎన్నికల్లోనూ ఆశీర్వదించి, అండగా నిలవాలని రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ కోరారు. గురువారం మండలంలోని గురవాం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో ప్రతీ ఇంటికి ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని, అందరూ ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇంతవరకు వైద్య వృత్తి ద్వారా సేలందించానని, ఇప్పుడు ప్రజాసేవకు మీ ముందుకు వచ్చానని, తనను కూడా ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ప్రతిపక్షాలు ఏకమైనప్పటికీ ప్రజలు మాత్రం వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారని, ప్రజలంతా ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి ఎంపీ అభ్యర్థిగా మరోసారి బరిలో ఉన్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కామోదుల శ్రీరంగంనాయుడు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయండి



తెర్లాంలో ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి

- ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: రాష్ట్ర వ్యాప్తంగా మే 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. మండల కేంద్రంలో గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించిన వారికి స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లోని ఇంటింటికీ వారు వెళ్లి, ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. ఎంపీగా మరోసారి బరిలో ఉన్న తనను గెలిపించాలని ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యేగా మళ్లీ పోటీ చేస్తున్న తనను కూడా ఆశీర్వదించి, గెలిపించాలని ఎమ్మెల్యే శంబంగి ఓటర్లను వేడుకున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతీ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేలా నవరత్నాల పథకాలు అమలు చేశారని, వీటితో ప్రతీ కుటుంబానికి మేలు జరిగిందన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ మళ్లీ కొనసాగాలంటే ప్రజలంతా వైఎస్సార్ సీపీకి మళ్లీ ఓటు వేసి, గెలిపించాలన్నారు. గత ప్రభుత్వాలు అమలు చేయనన్ని పథకాలను సీఎం జగన్ అమలు చేశారని, ఆ పథకాలు పొందిన ప్రజలే పార్టీ ప్రచారకర్తలుగా తయారు కావాలని పిలుపునిచ్చారు. మే 13న జరిగే ఎన్నికల పోలింగ్ వరకు ప్రతీ వైఎస్సార్ సీపీ కార్యకర్త, నాయకుడు సైనికుల్లా పనిచేసి పార్టీ ఘనవిజయంలో ముఖ్యపాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి బాబ్జీరావు, జెడ్పీటీసీ ప్రతినిధి రామారావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, అప్పలరాజు రమాదేవి, పార్టీ మండల అధ్యక్షుడు టి.సత్యంనాయుడు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు మర్రాపు జగన్నాథం పాల్గొన్నారు.


ఎన్నికల నిబంధనలు పాటించాలి



డీలర్లకు సూచనలిస్తున్న సీఎస్‌డీటీ స్వర్ణలత

బాడంగి: ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని మండల సీఎస్‌డీటీ స్వర్ణలత సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో గురువారం సమావేశమైన ఆమె ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూ.చ.తప్పకుండా పాటించాలని, ఎండీయూ వాహనాలపైనా, రేషన్‌డిపోల్లో ఎటువంటి ప్రభుత్వ, రాజకీయ పోస్టర్లు గానీ, బ్యానర్లు గానీ ఉండకూడదన్నారు. అలాగే 25 శాతం రాగిపిండి వచ్చినందున ప్రతీ డీలర్ విధిగా విడిపించి కార్డుదారులకు అందజేయాలన్నారు. డీలర్లు ఎన్నికల ప్రచారంలో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ పాల్గొనరాదన్నారు. ఎం.ఎల్.ఎస్. పాయింట్ వద్ద వేయింగ్ మిషన్ పనిచేయకపోవడంతో తూనికల్లో తేడాలు వస్తున్నాయని డీలర్లు తెలిపారు.

రూ.9.5 లక్షలతో ప్రహరీ నిర్మాణం



వైఎస్సార్ హెల్త్ క్లినిక్ చుట్టూ నిర్మించిన ప్రహరీ

రాజాం: మండలంలో పెనుబాక గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం చుట్టూ భారీ ప్రహరీ నిర్మించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో పాటు పంచాయతీ నిధుల నుంచి రూ.9.5 లక్షలతో ప్రహరీ, గేటు ఏర్పాటు చేశారు.

సిస్టర్ జానకి సేవలు అమూల్యం

బొబ్బిలి: బ్రహ్మకుమారీస్ శాఖలను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 135 దేశాల్లో విస్తరింపజేసి, ప్రేమ, ఆప్యాయతలు పంచిపెట్టిన సిస్టర్ జానకి సేవలు అమూల్యమైనవని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కొనియాడారు. మండల కేంద్రంలోని బ్రహ్మకుమారీస్ కేంద్రంలో సిస్టర్ జానకి స్మృతి దినం గురువారం నిర్వహించగా, ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ కమిషనర్ సిస్టర్ జానకి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆమె సేవలు ప్రశంసించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ బి.కె.రాజేశ్వరి పాల్గొన్నారు.

వివాదాలకు పాల్పడితే క్రిమినల్ కేసు



వంగర: సంగాంలో గ్రామస్తులకు సూచనలిస్తున్న ట్రైనీ డీఎస్పీ మహేంద్ర

వంగర: గ్రామాల్లో ప్రజలు వివాదాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ట్రైనీ డీఎస్పీ మహేంద్ర హెచ్చరించారు. గురువారం మండలంలోని సంగాంలో గ్రామస్తులతో సమావేశమైన ఆయన ఎన్నికల నిబంధనలపై సూచనలు చేశారు. ఎన్నికల వేళ అందరూ శాంతియుతంగా మెలగాలన్నారు. ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలన్నారు. నేరాలకు పాల్పడితే జీవితాలు నాశనం అయిపోతాయన్న విషయం అందరూ గుర్తుపెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వై.వి.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: సార్వత్రిక ఎన్నికల వేళ ఎవరూ వివాదాలకు పాల్పడవద్దని ఎస్ఐ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని అంబాడ, వెంకటాపురం గ్రామాల్లో గురువారం పర్యటించిన ఆయన అక్కడి ప్రజలకు ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి నడుచుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారాలకు వెళ్లేవారు ఇతరులను రెచ్చగొట్టడం వంటివి చేయరాదన్నారు.

రూ.27.80 లక్షలతో రక్షిత మంచినీటి పథకం నిర్మాణం

రాజాం సిటీ:

మండలంలోని నందబలగ పంచాయతీ, లక్ష్మీపురం గ్రామంలో రూ.27.80 లక్షలతో 15 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రక్షిత మంచినీటి పథకం ట్యాంకు నిర్మాణం చేపట్టారు. దీని ద్వారా ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీటి సరఫరాకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గతంలో వేసవి వచ్చిందంటే చాలు తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడాల్సి వచ్చేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చొరవతో గ్రామంలో రక్షిత పథకం నిర్మాణం చేపట్టడంతో ఇబ్బందులు తప్పనున్నాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



లక్ష్మీపురంలో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం నిర్మాణం

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



బూరిపేటలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

తెర్లాం: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలంతా సహకరించాలని, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుల ఫ్లాగ్‌మార్చ్ దోహదపడుతుందని తెర్లాం ఎస్ఐ ఆర్.రమేష్ అన్నారు. మండలంలోని బూరిపేట, అప్పలంపేట, గొలుగువలస, ఎస్.బూర్జవలస గ్రామాల్లో పోలీసులు గురువారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల వేళ గ్రామాల్లో ఎటువంటి గొడవలు, తగాదాలు జరగకుండా చూడాలన్నారు. మండలంలోని అతిసమస్యాత్మక, సమస్యాత్మక గ్రామాల్లో విడతల వారీగా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తూ ఓటర్లు తమ ఓటుహక్కును నిర్భయంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకునేలా ధైర్యం కల్పిస్తున్నామన్నారు. వాట్సాప్ గ్రూపుల్లో కూడా రెచ్చగొట్టే పోస్టులు చేయకూడదన్నారు. ఎవరైనా శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకునేందుకు వెనుకాడేదిలేదని ఆయన హెచ్చరించారు.

వంగర: ఎన్నికల వేళ ప్రజలంతా శాంతియుతంగా మెలగాలని ఎస్ఐ వై.వి.జనార్దన్ అన్నారు. మండలంలోని మగ్గూరు, మడ్డువలస గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించి, ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లోని ప్రజలు స్నేహభావంతో మెలగాలని, వివాదాలకు పాల్పడవద్దన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని, కార్యకర్తలంతా సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఐసీడీఎస్ బాడంగి పీవో కె.రాజ్యలక్ష్మి సూచించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం -4లో తెర్లాం సెక్టార్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆమె ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతీ కార్యకర్త తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని పాటించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసే పౌష్టికాహారం ప్యాకెట్లపై రాజకీయ, ప్రభుత్వ ప్రచార బొమ్మలు కూడా లేకుండా చూడాలన్నారు. ప్రీస్కూల్‌లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలన్నారు. ప్రతిరోజూ మెనూ ప్రకారం పౌష్టికాహారం అందివ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన అన్ని రికార్డులను ఆన్‌లైన్‌లోను, ఆఫ్‌లైన్‌లోనూ సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు పాటించండి

రామభద్రపురం:

వేసవికాలం నేపథ్యంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున వడదెబ్బ బారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారులు దిలీప్‌కుమార్, ఎ.ఎల్.జి.శిరీష అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వారు మీడియాతో మాట్లాడుతూ వేసవికాలంలో చిన్నపిల్లలకు వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. పనులు నిమిత్తం బయటకు వచ్చిన వారు గొడుగు వేసుకోవాలని, తెల్లరంగు కాటన్‌దుస్తులు, టోపీ లాంటివి ధరించాలన్నారు. ఈ కాలంలో మంచినీరు, నిమ్మకాయ రసం, మజ్జిగ, సాల్టు కంటెంట్ ఉన్న ద్రవాలను ఎక్కువగా తాగడం మంచిదన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అంగన్‌వాడీ కేంద్రాలు, ఏఎన్ఎంల వద్ద, ప్రాథమిక ఉపకేంద్రాల వద్ద అందుబాటులో ఉంటాయని ఒక్కో ప్యాకెట్ లీటరు నీటిలో కలిపి తాగితే మంచిదన్నారు. ప్రతిరోజూ వేడి గంజి తాగితే చాలా మంచిదన్నారు.